డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యను అభ్యసించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎలగొండ రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండానే ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు ఉచిత భోజన వసతి (హాస్టల్), ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆయన వివరించారు. వివరాలకు నేరుగా కళాశాలలో గాని లేదా సెల్ నెంబర్ 8019429413లో సంప్రదించాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభ పోస్టర్‌ను గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆవిష్కరించారు. ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ సభకు అధిక సంఖ్యలో పార్టీ శేణులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే

కథలాపూర్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేటలో గురువారం ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం ఎంపీడీవో శంకర్‌నాయక్ సర్వే నిర్వహించారు. మొదటి ప్రాధాన్యంలో భాగంగా భూమి ఉండి ఇళ్ళు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న వారి జాబితా రూపొందించి ప్రభుత్వానికి నివేదించడానికి కసరత్తు చేస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గఫూర్ ఉన్నారు.

నేడు అవగాహన సదస్సు

బీర్‌పూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం భూ భారతిపై రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ముంతాజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఆర్‌డీవో మధుసుదన్‌లు పాల్గొని రైతులకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని సూచించారు.

ఆర్టీసీ జేఏసీ ఏర్పాటు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌ఆర్టీసీ జగి త్యాల డిపోలో గురువారం ఈయూ, టీయంయూ, ఎస్‌ఎంయూ యూనియన్‌లకు సంబంధించిన నాయకులు జేఏసీగా ఏర్పాటై నూతన కమిటీని ప్రకటించారు. జగిత్యాల డిపో చైర్మెన్‌గా రామయ్య, వైస్ చైర్మెన్‌గా రాజయ్య, కన్వీనర్‌గా పీకే స్వామి, కో కన్వీనర్‌లుగా అబ్దుల్ కలీమ్, నరేందర్, కేఆర్ రావుతో పాటు సలహాదారులుగా కిరణ్, ఏఆర్‌సీ రెడ్డి, లింగన్న, రమణయ్య, కేఎస్‌రెడ్డి, సతీష్, శ్రీనివాస్, మల్లేశం, ఫయాజ్, ముసీబ్, లక్ష్మణ్‌లు ఎంపికయ్యారు. నూతన కమిటీకి ఆయా యూనియన్‌ల కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు.



జగిత్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం పంట ప్రణాళిక ఖరారైంది. వానాకాలంలో రైతుల ఇబ్బందులు తొలగించడానికి వ్యవసాయశాఖ ముందస్తుగా సాగు ప్రణాళిక రూపొందించింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా ఎన్ని ఎకరాల్లో భూమి సాగవుతుందని అంచనా వేసి ఈ మేరకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచనున్నారు. జిల్లాలో సాధారణ సాగు కంటే వచ్చే వానాకాలం సీజన్‌లో అధికంగా వివిధ పంటలు సాగు అవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు రూపొందించిన వానాకాలం పంట ప్రణాళికపై 'ఆంధ్రజ్యోతి' కథనం...

ఎరువుల ప్రణాళిక ఇలా...

జిల్లాలో ప్రతిపాదించిన పంటల విస్తీర్ణం ఆధారంగా ఎరువుల ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాకు అవసరమైన ఎరువుల సరఫరా కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను అధికారులు సమర్పించారు. ప్రస్తుత ఏప్రిల్ మాసం నుంచి రానున్న వానాకాలం సీజన్‌లో సెప్టెంబరు వరకు జిల్లాలో మొత్తం కాంప్లెక్స్ 10,653 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయన్న అంచనా ఉంది. యూరియా 40,351 మెట్రిక్ టన్నులు, డీఏపీ 7,768, ఎంఓపీ 26,632, ఎస్ఎస్‌పీ 3,329 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేశారు.

సాగు ప్రణాళిక ఖరారు

- జిల్లాలో 4.14 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు
- సాధారణానికి మించి సాగుకు అంచనా
- విత్తనాలు, ఎరువులు, కాంప్లెక్స్ ప్లానింగ్ సిద్ధం

జిల్లాలో 4,17,378 ఎకరాల్లో, 2024 వానాకాలం సీజన్‌లో 4,13,974 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. 2025 వానాకాలం సీజన్‌లో గత యేడాది కంటే 445 ఎకరాలు అధికంగా సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు.

3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా

జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగు అవుతుందన్న అంచనాను అధికారులు వేశారు. జిల్లాలో వివిధ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,14,419 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేశారు. ఇది సాధారణం కన్నా 78,441 ఎకరాలు అధికంగా ఉంది. మండలాల్లోని క్లస్టర్ల వారీగా సాగు విస్తీర్ణం అంచనాలను వ్యవసాయ అధికారులు రూపొందించారు. ఇందులో ప్రధానంగా వరి 3,10,642 ఎకరాలు, మొక్కజొన్న 32,000 ఎకరాలు, కందులు 1,500, పెసర్లు 100, సోయా చిక్కుడు 500, పత్తి 18,000, చెరుకు 500 ఎకరాలు, పసుపు 8,500, మిరప 500 ఎకరాలు, పలు కూరగాయల పంటలు 400 ఎకరాలు, ఆయిల్ ఫాం 3,000 ఎకరాలు, మామిడి 38,277 ఎకరాలు, ఇతర పంటలు 500 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. 2023 సంవత్సరం వానాకాలం సీజన్‌లో

అంచనాలు రూపొందించాం

భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



జిల్లాలో రానున్న వానాకాలం పంట సాగు అంచనాలను రూపొందించాం. అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువు లను రైతులకు అందుబాటులో ఉంచేందుకు కసరత్తులు చేస్తున్నాం. జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, ఇతర పంటలను సాగు చేస్తారు. ఇందుకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సిద్ధం చేస్తున్నాం. రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించడానికి ప్రణాళిక రూపొందించాం.

నకిలీ విత్తన విక్రయాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో సుమారు 450 విత్తన విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వాటి ద్వారా విత్తనాన్ని రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. నకిలీ పత్తి, ఇతర విత్తన విక్రయాలను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో భాగంగా పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి బృందాలను ఏర్పాటు చేశారు. మే 3వ వారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని విత్తన విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనం, ఎరువుల, పరుగు మందులు అందించడానికి అధికారులు ఇచ్చిన లక్ష్యం ప్రకారం ప్రతీ ఎరువు, విత్తన దుకాణాలను తనిఖీ చేసి నమునాలను సేకరించి పరీక్షా కేంద్రానికి పంపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.



మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణలో యువత భాగస్వాములు కావాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరి ణామాలపై జిల్లా పోలీసు శాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వాటివల్ల కలిగే నష్టాలను యువత, విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ మాట్లాడుతూ చెడు వ్యసనాలు, అలవాట్లకు ఆకర్షితులై యువత, విద్యార్థులు తమ జీవితాలు నాశనం చేసుకోకూడదని, విద్యార్థి దశ నుంచే ఉన్నత స్థాయిలో ఆలోచనలు ఉండాలని అలాంటి ఆలోచనల వల్లనే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యం అవుతుందన్నారు. యువత మాదకద్రవ్యాలకు పూర్తిస్థాయిలో దూరంగా ఉండాలన్నారు. వాటికి బానిస కావడం వల్ల అనుకోకుండా అసాంఘిక చర్యలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. దీంతో నేరచరితులుగా పరిగణింపబడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు, గంజాయి గురించి సమాచారం అందితే స్థానిక పోలీసులకు గానీ, డయల్ 100కు గానీ సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో డ్రగ్స్ రహిత వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టిసారించడం జరిగిందన్నారు. డ్రగ్స్ గంజాయి రహిత జిల్లాగా మార్చడం జరుగుతుందన్నారు. అనంతరం తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార పోస్టర్లను ఆయన చేతులమీదుగా ఆవిష్కరించారు. అవగాహన సమావేశం అనంతరం రాష్ట్ర ప్రభుత్వంచే రూపొందించబడిన షార్ట్ ఫిల్మ్‌ను విద్యార్థులతో కలిసి ఆయన తిలకించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సైదానాయక్, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, డీఅడెక్ట్ ట్రైనర్ పర్లపల్లి రాజు, సీసీఎస్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ సదాకర్‌తో పాటు ఎన్ఎస్ఎస్ అధికారి ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

వడదెబ్బతో రైతు మృతి 5

కూరగాయల సాగులో మహిళా రైతులు

నేరుగా మార్కెట్‌లో విక్రయాలు

నెలకు రూ.30 వేల ఆదాయం 4

పంచాయతీరాజ్ దినోత్సవం

పెగడపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులంతా కలసి కేక్ కట్ చేశారు.

అనంతరం గ్రామ సభ నిర్వహించి మరుగుదొడ్ల వాడకం, వర్షం నీటిని వృదా చేయకుండా ఇంకుడు గుంతల నిర్మాణం చేయడం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారితో కలసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కారోబార్ స్వామి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మామిడి కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి

-కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల మార్కెట్‌లో మామిడిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మామిడి కొనుగోళ్లలో వ్యాపారులు, ఏజెంట్లు నిబంధనలు పాటించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. జిల్లా కేంద్రం శివారులోని చల్‌గల్ సమీపంలో గల మామిడి మార్కెట్‌ను గురువారం రాత్రి కలెక్టర్ సందర్శించారు. మార్కెట్‌లో జరుగుతున్న మామిడి కొనుగోళ్లను పర్యవేక్షించారు. పలువురు రైతులతో మాట్లాడి మామిడి సాగు విధానం, ప్రస్తుతం ఎంత విస్తీర్ణంలో పంట వేశారు, అంతర్ పంటల సాగు, నీటి వనరుల లభ్యత, దిగుబడి విధానం, మార్కెటింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో రైతులకు కల్పించిన వసతులు, అందిస్తున్న ధరలు, మార్కెట్ వస్తున్న మామిడి నాణ్యత, ఓపెన్ మార్కెట్‌లో వేలం పాట విధానం తదితర అంశాలను పరిశీలించారు. కమీషన్ ఏజంట్లు, వ్యాపారుల తీరును అడిగి తెలుసుకున్నారు. కమీషన్ ఏజంట్లు నిబంధనల ప్రకారం కేవలం నాలుగు శాతం కమీషన్ మాత్రమే వసూలు చేయాలని ఆదేశించారు. మామిడి మార్కెట్ ప్రాంతంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీఓ మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, పలువురు రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'భూ భారతితో సాదా బైనామాలకు పరిష్కారం'

కొడిమ్యాల, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో సాదా బైనామాలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని పూడూర్ గ్రామ శివారులోని ఎల్.కె గార్డెన్‌లో నిర్వహించిన భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా పక్కగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారన్నారు. ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తె తహసీల్దార్ విచారణ జరిపి మ్యూటేషన్ చేస్తారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయం చేసె దిశగా ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మదునూదన్‌గౌడ్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో స్వరూప, ఏవో జ్యోతి, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కొడిమ్యాల, పూడూర్ సింగిల్‌విండోల చైర్మన్లు రాజనర్సింగరావు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగకుండా చూడాలి

మల్యాల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగకుండా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మల్యాల మండలం నూకపల్లి, బల్వంతాపూర్ గ్రామాల్లో గల ప్యాక్స్ కేంద్రాలను కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌డీఓ మధుసూధన్, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

-కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని ఆయన అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో రూ.90,10,440 విలువ గల 90మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మెట్‌పల్లి ఏంఎసీ చైర్మన్ కూన గోవర్ధన్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అత్యధికంగా పించన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మంజూరు చేయించిన ఘనత మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌దేనన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచులు పీసు తిరుపతిరెడ్డి, కట్టా శ్రీధర్, ఆరెళ్ల రాజాగౌడ్, కౌన్సిలర్లు ఓజ్జెల బుచ్చిరెడ్డి, కిషోర్, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, ఒజ్జెల శ్రీనివాస్, డాకూరి వెంకటేష్, అనిరెడ్డి మారుతిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ రాజుమహమద్, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని సందర్శించిన టీస్కాబ్ అధికారులు

రాయికల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సహకార సంఘాల సెక్రెటరీ, సిబ్బంది మల్టీపర్పస్ బిజినెస్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో భాగంగా టీస్కాబ్ అధికారులు టి.విజయ శంకర్, కె.సంపత్ కుమార్‌లు రాయికల్ సహకార సంఘాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం లోన్స్, డిపాజిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో కేడీసీసీబీ ఏజీఎం మహేష్, కోరుట్ల కేడీసీసీ మేనేజర్ మున్వార్ అలీ, రాయికల్ కేడీసీసీ మేనేజర్ మార్కండేయ, ఫీల్డ్ ఆఫీసర్ అనిల్ కుమార్, సొసైటీ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి, సీఈవో రవికుమార్ పాల్గొన్నారు.

'ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కేసులు'

కథలాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారిణి యోగిత హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎరువులు, పురుగు మందుల దుకాణ డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దుకాణాల్లో ఒరిజినల్ లైసెన్స్, బిల్లు బుక్కులు, తమ వద్ద ఉన్న స్టాక్ వివరాలు బ్లాక్ బోర్డుపై రైతులకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. ఎరువులను సక్రమంగా రైతులకు విక్రయించాలని అన్నారు. ఈకార్యక్రమంలో పలువురు డీలర్లు పాల్గొన్నారు.

జగిత్యాల సీపీవోగా మల్లేశం

జగిత్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో)గా మల్లేశంకు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాలలో అసిస్టెంట్ డైరెక్టర్ క్యాడర్‌లో పనిచేస్తున్న పూర్ణచందర్ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై గురువారం మంచిర్యాల జిల్లా సీపీవోగా బదిలీ అయ్యారు. జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా సీపీఓగా పనిచేస్తున్న పూర్ణచందర్ గత కొన్ని రోజులుగా సెలవులో ఉన్నారు. డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ మంచిర్యాల సీపీఓగా బదిలీ చేయడంతో జగిత్యాల నుంచి పూర్ణ చందర్ రిలీవ్ అయ్యారు. సిద్దిపేట సీపీఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మల్లేశంను జగిత్యాల ఇన్‌చార్జి సీపీఓగా బాధ్యతలు అప్పగించాచారు. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో మల్లేశం జగిత్యాలలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా పదోన్నతి పొందిన సీపీఓ పూర్ణచందర్‌ను పలువురు కార్యాలయ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు అభినందించారు.

టీపీసీసీ పరిశీలకులు వస్తున్నారు..

-జిల్లాకు ఇద్దరి నియామకం

-కత్తి వెంకటస్వామి, అంజన్ కుమార్‌లకు బాధ్యతలు

జగిత్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంలో భాగంగా టీపీసీసీ ఇద్దరు పరిశీలకులను నియామకం చేసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ల నేతృత్వంలో పరిశీలకుల నియామకం జరిగింది. జగిత్యాల జిల్లా టీపీసీసీ పరిశీలకులుగా కత్తి వెంకటస్వామి, అంజన్ కుమార్‌లను నియమించింది.

● పరిశీలకులకు ప్రత్యేక బాధ్యతలు..

జిల్లా పరిశీలకులుగా నియమితులైన వెంకటస్వామి, అంజన్ కుమార్‌లు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, సీనియర్ నేతలతో సమావేశం కానున్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

ధర్మపురి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన దుబాయ్‌లో దారుణంగా హత్యకు గురైన ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ భార్య స్వర్గం జమున, కొడుకులు స్వర్గం చందు, సూర్యతో పాటు తల్లి స్వర్గం రాజవ్వను ఆయన పరామర్శించారు. అనంతరం ధర్మపురి పట్టణానికి చెందిన దహెగాం గిరీష్ గుండె పోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను కూడ ఆయన పరామర్శించారు. మృతి వివరాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'తడి, పొడి చెత్తను వేరు చేయాలి'



ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మారుతిప్రసాద్

కోరుట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణవాసులు తడి, పొడి చెత్తను వేరు చేసి వాహనంలో వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఎరువుల తయారీ కేంద్రంతో పాటు ఎనిమల్ కేర్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఎరువు తయారు చేస్తున్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను పారిశుధ్య సిబ్బందికి సూచించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ఎరువులను కిలోకు రూ.10 చెల్లించి రైతులు తీసుకోవచ్చునని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్ సెంటర్‌కు తరలించి ఎరువులు తయారు చేస్తున్నామని అన్నారు. పొడి చెత్తను డిఆర్‌సీసీ సెంటర్ సెంటర్‌కు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

-ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తాగునీటి సరాఫరా పరిస్థితిపై సంబంధిత అధికారులతో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. బీర్‌పూర్ మండలం లంబాడితండా, నాయకపుగూడెం కందెన కుంటలో, సారంగపూర్ మండలంలోని బీమిరెడ్డి గూడెం, రాయికల్ మండలంలోని కొత్తపేట, తూరక కాశీనగర్, జగిత్యాల మండలంలోని మోతే, ఎస్‌సీ, ఎస్‌టీ కాలనీల్లో నూతన వాటర్ ట్యాంకులు నిర్మించి ప్రజలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. గ్రామాలలో కంట్రోల్ వాల్ నీటి సరఫరాలో గ్రామ కార్యదర్శి కారోబార్‌లు వాటర్ లెవల్ కమిటీతో భాగస్వామ్యం చేసి నీటి వృధాను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేశ్, డీఈలు రామారావు, జలందర్ రెడ్డి, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేసిన యువకులు

- ప్రయాణికుడిపై దాడి
- కేసు నమోదు చేసిన పోలీసులు

గన్నేరువరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ రోడ్డుపై డ్యాన్స్‌లు చేస్తూ బస్సుకు సైడ్ ఇవ్వమని అడిగినందుకు బస్సు అద్దాలను ధ్వంసం చేయడంతోపాటు ప్రయాణికుడిపై దాడి చేసిన సంఘటన మండలంలోని జంగపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కరీంనగర్ నుంచి చొక్కారావుపల్లికి వెళుతున్న లాస్ట్‌ట్రిప్పు ఆర్టీసీ బస్సు (టీఎస్02యుబీ7429) జంగపల్లి గ్రామానికి చేరుకుంది. అదే సమయంలో స్థానిక ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ బస్సును చాలా సమయం రోడ్డుపై నిలిపి వేచిచూశాడు. బస్సులోని ప్రయాణికులు బస్సును ముందుకు నడిపించాలని డ్రైవర్‌ను కోరగా డ్రైవర్ మొండయ్య, కండక్టర్ ప్రవీణ్‌తోపాటు విధులు ముగించుకొని అదేబస్సులో వస్తున్న షైలారంకు చెందిన మరోడ్రైవర్ పులి అనిల్ బస్సుకు దారి ఇవ్వమని అడిగారు. దీంతో ముదిరాజ్ కులస్థులైన చింతల రమేష్‌తోపాటు మరికొందరు యువకులు బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. పులి అనిల్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో బస్సు డ్రైవర్ మొండయ్య ధ్వంసమైన బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు విషయాన్ని తెలిపాడు. డ్రైవర్ మొండయ్య ఫిర్యాదు మేరకు చింతల రమేష్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

తాగునీటి ఎద్దడిపై ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

గంభీరావుపేట ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని 9వ వార్డులో తాగునీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కనెక్షన్ కూడా లేదని, ఈ విషయం సంబంధిత అధికారులతో ఎన్నోసార్లు చెప్పానమని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని మంచినీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు.

కూరగాయల సాగులో
మహిళా రైతులు



- నేరుగా మార్కెట్‌లో విక్రయాలు
- నెలకు రూ.30 వేల ఆదాయం

మల్లాపూర్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన పలువురు మహిళా రైతులు కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మెట్‌పల్లి డివిజన్‌లో కూరగాయల సాగులో మొగిలిపేట గ్రామం రెండో స్థానంలో ఉంది. గ్రామంలో సుమారు 50 ఎకరాల్లో మహిళా రైతులు వివిధ రకాల కూరగాయలు సాగు చూస్తూ దళారులకు కాకుండా నేరుగా మార్కెట్‌కు వెళ్లి విక్రయాలు చేస్తున్నారు. 20 మంది మహిళా రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో మిర్చి, టమాటో, క్యారెట్, క్యాబేజి, వంకాయ, సోరకాయలతో పలు రకాల ఆకు కూరలను పండిస్తున్నారు. పండించిన కూరగాయలను నేరుగా మెట్‌పల్లి, మల్లాపూర్, నిర్మల్ జిల్లా ఖానాపూర్ తదితర మార్కెట్లకు వెళ్లి విక్రయిస్తున్నారు. నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.



మొగిలిపేటలో మహిళా రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలు

కూరగాయల సాగు లాభాదాయకం
-సామ రాధ, రైతు, మొగిలిపేట



మిగిలిన పంటలతో పోలిస్తే కూరగాయాల సాగు లాభదాయకంగా ఉంటుంది. దళారులకు కాకుండా నేరుగా మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు అమ్ముకోవడంతో మరింత లాభాలు వస్తాయి. ప్రతి రోజు ఉదయం తోటకు వెళ్లి నీరు పెట్టి పండిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతా.



మార్కెట్‌లో కూరగాయలను విక్రయిస్తున్న మహిళా రైతులు

నెలకు రూ.30 వేల ఆదాయం
-దామెర లత, రైతు, మొగిలిపేట



గ్రామంలో 20 మంది మహిళా రైతులం కలిసి పండించిన కూరగాయలను మార్కెట్లకు వెళ్లి విక్రయిస్తాం. నెలకు సుమారు రూ.30 వేల ఆదాయం వస్తుంది. మాకున్న వ్యవసాయ భూమిలో మిర్చి, టమాటో, క్యారెట్, క్యాబేజి, వంకాయ, సోరకాయలతో పలు రకాల ఆకు కూరలు పండిస్తా.

అల్గునూరులో 60 బస్తాల ధాన్యం చోరీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్గునూర్‌లో ఓ రైతు ఖాళీస్థలంలో ఆరబోసుకున్న వరిధాన్యాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. అలుగునూర్‌కి చెందిన ముంజ రాములు మూడురోజుల క్రితం వరికోసి వచ్చిన ధాన్యాన్ని వెంకటే శ్వరకాలనీ సమీపంలో ఓఖాళీ స్థలంలో ఆరబోసుకున్నాడు. అయితే రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆర బెట్టుకున్న ధాన్యంలో సుమారు 60బస్తాల ధాన్యం ఎత్తుకెళ్లారు. ధాన్యం విలువ సుమారు 50వేల రూపాయల ఉంటుందని రైతు రాములు వాపోయాడు. సంఘటన స్థలంలో కొన్ని సంచులు నింపిఉన్నాయి. ధాన్యం తీసుకెళ్లిన వారి చెప్పులు అక్కడే విడిచిపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా అలుగునూర్‌తోపాటు తిమ్మాపూర్ మండలంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలుగునూర్‌లో ఈ మధ్య రెండు బైక్‌లు, ఎల్ఎండీ కాలనీలోని సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చిలో దొంగలు పడి హుండీని ఎత్తుకెళ్లారు. మిర్చియార్డులో దొంగలుపడి రూ.80వేల నగదు ఎతుకెళ్లారు. పలుగ్రామాల ఆలయాల్లో బంగారు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి.

చెట్లను తొలగించిన సెస్ సిబ్బందిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ అనుమతి లేకుండా రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లను తొలగించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, రాజన్నపేటకు చెందిన సెస్ సిబ్బంది దాసరి బాబు, ద్యావ లక్ష్మణ్ లపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ నిధులతో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించారని పేర్కొన్నారు. చెట్లను నరికి వేయడంతో సుమారు రూ.1,00,978 నష్టం వాటిల్లిందని పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

కలెక్టర్ గారూ..! మాకు మీరే న్యాయం చేయాలి..

శంకరపట్నం, ఏప్రిల్ 24 (ఆంధజ్యోతి): కలెక్టర్ గారూ..! మాకు మీరే న్యాయం చేయాలని జాతీయ రహదారి-563లో నివేశనస్థలాలు కోల్పోతున్న నిర్వాసితులు వేడుకున్నారు. గురువారం శంకరపట్నంలో భూ భారతి కొత్తచట్టంపై రైతుఅవగాహన సదస్సుకు వచ్చిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కేశవపట్నంలోని సర్వే నంబర్ 552లో నివేశనస్థలాలను కోల్పోతున్న నిర్వాసితులు వినతిపత్రం అందజేసి, తమగోడు వెళ్లబోసుకున్నారు. తమస్థలాలకు మూడేళ్లక్రితమే వాస్తవ బహిరంగ మార్కెట్ ధర చదరపు గజానికి రూ.20వేలు పలుకగా, జాతీయరహదారి విస్తరణలో భాగంగా సేకరించిన తమ ఓపెన్‌ప్లాట్లకు మాత్రం 2013మార్కెట్ వాల్యూ ప్రకారం అధికారులు చదరపు గజానికి కేవలం రూ.1221 మాత్రమే నష్టపరిహారంగా చెల్లించి చేతులు దులుపుకున్నారన్నారు. 2013నుంచి పరిహారం చెల్లించే సమయంవరకు అధికారులు మార్కెట్‌వాల్యూను కూడా రివైజ్ చేయలేదన్నారు. అంతేకాక ప్రధానరహదారికి పక్కన ఒకవైపు మిషన్ భగీరథ పైపులైను వేయడంతో కేవలం తమవైపు మాత్రమే అధికమొత్తంలో స్థలాలను కోల్పోయామన్నారు. మా పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పైసాపైసా పోగుచేసి కూడబెట్టిన కష్టార్జితంతో ఈ ప్లాట్‌లను కొనుగోలు చేశామన్నారు. ఆర్బిట్రేషన్‌లో భాగంగా ప్రస్తుతం ఫైలు మీ పరిశీలనలో ఉన్నదని, మీరైనా కనికరించి వాస్తవ బహిరంగ మార్కెట్ వాల్యూ ప్రకారం ధర చెల్లించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పల్కల శ్రీనివాస్‌రెడ్డి, కొంపెల్లి మహేందర్‌రెడ్డి, పొన్నపూల రాజయ్య, జనగాం బుచ్చయ్య, నామని సంపత్, సిరిసేటి స్వరూప, గోపు మాధవి-శ్రీనివాస్‌రెడ్డి, కాటం వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల మండలంలో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన జగిత్యాల పట్టణం వాణినగర్‌కు చెందిన గడ్డం ఆంజనేయులును పోలీసులు అరెస్ట్ చేశారు. ధరూర్ గ్రామానికి చెందిన కొత్తలక్ష్మీ, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కడార్ల నరసింహచారి అనే ఇద్దరు వ్యక్తుల ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ఆంజనేయులును అరెస్ట్ చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

చందుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్లుడిపై దాడికి పాల్పడిన సంఘటనలో మామతో పాటు బామర్దిపై కేసు నమోదైన సంఘటన చందుర్తి పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన నాగుల రాజు తన భార్యతో బుధవారం రాత్రి పశువులకు దాణా పెట్టడం విషయంలో గొడవ పడడంతో, భార్య తన కుమారుని తీసుకొని తల్లిగారి ఊరైన ఇదే మండలంలోని సనుగులకు వెళ్లింది. దీంతో రాజు భార్యను తీసుకరావడానికి సనుగుల గ్రామంలోని తన భార్య వద్దకు వెళ్లగా మామ బూర్ల మల్లయ్య, బామ్మర్ది బూర్ల పవన్‌లు రాజును కర్రతో చితకబాదడంతో తలకు, చేతికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లయ్య, పవన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అంజయ్య తెలిపారు.

రేణికుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి, మరో ఆరుగురికి తీవ్రగాయాలు



రేణికుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం



బీరెడ్డి నక్షత్రమ్మ(ఫైల్)



కాసర్ల తిరుపతి(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట వద్ద గురువారం ప్రయాణికులతో వెళుతున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో సంఘటన స్థలంలో ఒకరు, ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరొకరు మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎల్ఎండీపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని చింతకుంటకు చెందిన కసర్ల తిరుపతి(55) గురువారం ఆటోలో ప్యాసింజర్ లను ఎక్కించుకొని బెజ్జంకి నుంచి కరీంనగర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులో వేగంగా వస్తున్న బియ్యం లోడ్‌లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటలో ఆటోడ్రైవర్ కాసర్ల తిరుపతి అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలో ప్రయాణి స్తున్న ఆరుగురు త్రీవంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై వివేక్, బ్లూకోట్స్ సిబ్బంది రాజు స్థానికుల సాయంతో క్షతగాత్రులను అంబులెన్సుల్లో కరీంనగర్‌లోని ఆసుపత్రులకు తరలించారు. ఇందులో ఆటోలో ప్రయాణిస్తున్న సిద్దిపేట జిల్లా బెజ్జంకి గ్రామానికిచెందిన బీరెడ్డి నక్ష త్రమ్మ (57) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. ఆటోలో ప్రయాణి స్తున్న ప్రయాణికులు బెజ్జంకి మండలం గుగ్గిళ్లకు చెందిన పున్నం సాయికిరణ్, బెజ్జంకికి చెందిన బీరెడ్డి ఆనందర్‌రెడ్డి, ఐలెని నవీన్‌రెడ్డి, కరీంనగర్‌లోని చింతకుంటకు చెందిన కసర్ల కరుణ, చింతకుంటకు చెందిన మౌనిక, బెజ్జంకి మండలం దాచారం గ్రామానికి చెందిన కొలిపాక మంజుల తీవ్రగాయాలతో ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారు. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు.. ప్రమాదానికి కారణమైన లారీని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

సంఘట స్థలాన్ని కరీంనగర్‌రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్ పరిశీలించారు. ప్రమాదం ఏలా జరిగింది అనే దానిపై ఎల్ఎండీ ఎస్సై వివేక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివైడర్ల వెంట లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వెలుతురు లేక రోడ్డుప్రమాదాలు సంభ విస్తున్నాయని, వెంటనే లైట్లను ఏర్పాటు చేయాలని హెచ్‌కేఆర్ టోల్ ప్లాజా సిబ్బందిని ఏసీపీ ఆదేశించారు.

ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న కసర్ల తిరుపతి(55) తన కూతురు మౌనికకు పసిరికలు(జాండిస్) మందుకోసం భార్య కరుణతో కలిసి అంటకాలపల్లి వచ్చి వెళుతున్నాడు. ఈ ప్రమాదంలో తిరుపతి మృతి చెందగా, భార్య కరుణ, కూతురు మౌనిక తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బెజ్జంకి ఎక్స్ రోడ్డులో ఉంటున్న బీరెడ్డి నక్షత్రమ్మ ఈ మధ్యనే రేకుర్తిలో కంటికి చికిత్స చేయించుకుంది. గురువారం చెకప్‌కు వెళ్లేందుకు భర్త బీరెడ్డి ఆనంద్‌రెడ్డితో కలిసి ఆటోలో ఎక్కగా ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో మృతిచెందింది.

శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో మంటలు



చెలరేగుతున్న మంటలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వ విద్యాలయం ఆవరణలో ఎండుగడ్డికి మంటలు అంటుకుని ఎస్‌యూ పాలనాభవనాల వరకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకు న్న కరీంనగర్, మానకొండూర్, వేములవాడ ఫైర్ ఇంజన్‌లతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. గురువారం ఉదయం 11:30 గంటల నుంచి రాత్రి వరకు మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఒక వైపు మంటలను నీటితో అదుపులోకి తీసుకువస్తుండగా మరో వైపునకు మంటలు వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలంలోనే ఉండి అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు. కరీంనగర్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 20మందికిపైగా సిబ్బంది ఈ ఫైర్‌ఫైటింగ్‌లో పాల్గొన్నారు. ఎస్‌యూ విశాలమైన ఆవరణలో చెట్లు, గుట్టలు, ముళ్లపొదలు నిండిఉంటాయి. ప్రతి సంవత్సరం ఇలాగే రెండు మూడుసార్లు గడ్డికి, చెత్తకు మంటలు అంటుకుని అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ అగ్నిప్రమాదాలలో విలువైన, అరుదైన మొక్కలు కాలిపోతున్నాయి. అయినప్పటికీ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. శాతవాహన విశ్వవిద్యాలయం 200 ఎకరాలలో విస్తరించి ఉన్నది. ఇక్కడ ఎలుగుబంట్లు, కొండగొర్రె, నెమళ్లు, కుందేళ్లు, కొండచిలువలు, పక్షులు నివసిస్తున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగినపు డు జంతువులు, పక్షులకు ప్రాణసంకటంగా మారుతోంది.

కోతుల దాడిలో రైతుకు గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రైతుపై కోతులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన పుట్ట రాజారాంరెడ్డి అనే రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద కూరగాయలు సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం ఒక్కసారిగా వందలాది కోతులు పంటపై దాడి చేస్తున్నాయి. వీటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా మూడు కోతులు రైతుపై దాడికి పాల్పడ్డాయి. కోతుల దాడిలో గాయపడిన రైతు కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు.

సారీ నాన్న.. నాకు బతకాలని లేదు

- అద్దంపై రాసి యువతి ఆత్మహత్య




ప్రసన్నలక్ష్మి (ఫైల్)

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): సారీ నాన్న.. నాకు బతకాలని లేదు అంటూ జగిత్యాలకు చెందిన ఓ యువతి అద్దంపై రాసి గురువారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లా పోచమ్మ వాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రసన్నలక్ష్మి(28)కి వెల్గటూర్ మండలం రామునూరి గ్రామానికి చెందిన గాంధారి తిరుపతికి 2023లో వివాహం జరిగింది. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కాగా వీరికి సంవత్సరం క్రితం బాబు జన్మించడంతో ప్రసన్నలక్ష్మి ఉద్యోగం మానేసింది. కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ప్రసన్నలక్ష్మి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా తన కుమారుడిని తనభర్తకు గాని అత్త మామలకు గాని ఇవ్వొద్దని ఆత్మహత్యకు ముందు సూసైడ్‌నోట్ రాసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని రోజులుగా భర్తతోపాటు అత్త, మామ వేధింపులకు గురిచేయడంతోనే ప్రసన్నలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు ఆరోపిస్తున్నారు.

అవగాహనతోనే అడ్డుకట్ట

- వ్యాధి తీవ్రత తగ్గించడంపై చర్యలు
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మలేరియా ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన వ్యాధిల్లో ఒకటి. 2017లో ప్రపంచ వ్యాప్తంగా 21.9 కోట్లకుపైగా కేసులు, 4.35 లక్షల మరణాలకు కారణమైంది. ఈ సంఖ్యను తగ్గించడానికి, వ్యాధి దాని నివారణ గురించి అవగాహన పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా చర్యలు తీసుకున్నారు. ప్రారంభ లక్షణాలు, జాగ్రత్తలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పిస్తే వ్యాధిని తగ్గించవచ్చని గుర్తించారు. మలేరియా మరణాలను తగ్గించడంపై చాలా దేశాల్లో చర్యలు చేపట్టారు. ఇందుకు అనుగుణంగా మే 25న ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకుంటున్నారు. ఇది ప్రపంచం దృష్టిని ఆకర్షించడానికి, ప్రజలు ప్రభావితమయ్యే తీవ్రతను తగ్గించడంలో సహాయం చేయడానికి ఒక వేదికగా నిలిచింది. కొవిడ్ కారణంగా మలేరియా సేవలలో కొంత అంతరాయం కలిగింది. దాంతో గతంలో కంటే వేయి కేసులు పెరిగాయి. మలేరియా అనే పరాన్నజీవి ఇన్ఫెక్షన్ ఆడ(అనాఫిలిస్)దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది తీవ్రమై కొన్నిసార్లు ప్రాణాంతక అనారోగ్యానికి కారమణమవుతుందని వైద్య నిపుణులు తెలియచేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 200 కోట్ల మంది మలేరియా బారిన పడుతున్నారనే అంచనా ఉన్నది. 2008లో తొలిసారిగా మే 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు.



జిల్లాలో తగ్గిన కేసులు

జిల్లాలో మలేరియా కేసులు క్రమంగా తగ్గుతున్నాయని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలియచేస్తున్నారు. 2019 నుంచి క్రమక్రమంగా మలేరియా కేసులు తగ్గుతున్నట్లు అధి కారిక లెక్కలు చెబుతున్నాయి. సంవత్సరానికి ఒకటి రెండు చొప్పున నమోదు అయ్యాయని, అది వలస కార్మికులని వైద్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. 2024లో 83,872 మందికి రక్త పరీక్షలు చేశామని, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 24,674 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

మలేరియా నివారణ

రాత్రిపూట బయట ఉంటే పొడువాటి చేతుల దుస్తులు, ప్యాంటు వాడాలి. మంచంపై దోమతెరలు కట్టుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి తొట్టిలను ఎల్లప్పుడూ మూతతో కప్పిఉంచాలి.

ఆర్టీసీ కరీంనగర్-2 డిపోకు అత్యుత్తమ కేఎంపీఎల్ అవార్డు



ఆర్టీసీ ఎండీచేతుల మీదుగా అత్యుత్తమ అవార్డు అందుకుంటున్న కరీంనగర్ ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్-2 డిపోకు అశోక్ లీలాండ్ సంస్థచే అత్యుత్తమ కేఎంపిఎల్, మైలేజ్ అవార్డును హైదరాబాద్ ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్ చేతుల మీదుగా కరీంనగర్ ఆర్టీసీ అధికారులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో నిర్వహించిన టెక్నికల్ సెమినార్‌లోబిఎస్-6 బస్సుల అత్యుత్తమ హెచ్‌ఎస్‌డి కేఎంపిఎల్ 5.86 సాధించినందుకు, అశోక్ లీలాండ్ ఇంజిన్ నందు హైమైలేజ్ 20.40 లక్షల కిలోమీటర్లను సాధించినందుకు రాష్ట్రస్థాయిలో అవార్డులను కరీంనగర్-2 డిపో సాధించింది. ఎండీ చేతుల మీదుగా కరీంనగర్ ఆర్‌ఎం బి రాజు, కరీంనగర్-2 డిపోమేనేజర్ శ్రీనివాస్, గతంలో పనిచేసిన వి మల్లయ్య అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు మునిశేఖర్, సోలమన్, ఖుస్రోషాఖాన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

● 165 గ్రాముల గంజాయి స్వాధీనం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని నాందేడు పట్టణంలో గంజాయి కొనుగోలు చేసి రైలులో కోరుట్లకు చేరుకున్న ఇద్దరు వ్యక్తులను కోరుట్ల పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కోరుట్ల పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన గాజుల లిఖేష్ అదే గ్రామానికి చెందిన బాలుడు తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి కోరుట్ల, కథలాపూర్ మండలంతో పాటు కోరుట్ల పట్టణంలో యువకులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. లిఖేష్‌తో పాటు బాలుడు మహారాష్ట్రలోని నాందేడు వెళ్లి అక్కడ 164 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి బుధవారం రాత్రి కోరుట్ల పట్టణానికి చేరుకున్నట్లు తెలిపారు. పక్కా సమాచారంతో వారిని సోదా చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో గంజాయి లభించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. లిఖేష్‌తో పాటు బాలుడిపై కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్‌పీ అడ్డూరి రాములు, కోరుట్ల సీఐ సురేష్‌బాబులు అభినందించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా గన్నేరువరం



ఖాసింపేట మానసాదేవి ఆలయం

● మండలానికి పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులు

● సౌకర్యాలు కల్పించాలని డిమాండ్

గన్నేరువరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతమైన గన్నేరువరం మండలం ఆధ్యాత్మిక కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. మండలంలో ఆలయాలకు భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. మానేరు డ్యాంను ఆనుకుని ఉన్న గన్నేరువరం మండలంలో సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని అరుదైన ఆలయాల గురించి తెలుసుకుందాం..

● మానసాదేవి ఆలయం..

మండలంలోని ఖాసింపేటలో స్వయంభువుగా వెలసిన పవిత్రమైన ఆలయం మానసాదేవి ఆలయం. భారతదేశంలో ఈ ఆలయం మొదటిది హరిద్వార్‌లో ఉండగా రెండోది ఖాసింపేటలో ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో వీరభద్రస్వామి ఆలయం ఉండేది. వీరభద్రస్వామి ఆలయ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా మానసాదేవి అమ్మవారి విగ్రహం లభించింది. ఈ విగ్రహం సుమారు 800సంవత్సరాల పురాతనమైందని గ్రామస్థులు నమ్ముతారు. ఆలయంలోని కోనేటిలో ఉన్న 108 శివలింగ జంటనాగ ప్రతిమలు ఉన్నాయి. భక్తులు నీటితో ఈ విగ్రహాలకు అభిషేకం చేస్తారు. ఇది సర్పదోష నివారణకు సహాయపడుతుందని భక్తుల నమ్మకం. ఈ ఆలయం భక్తుల కోరికలను నెరవేర్చే పవిత్ర స్థలంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తులు అధికంగా వస్తారు.

● మైలారం మల్లికార్జునస్వామి ఆలయం

మండలంలోని మైలారం గ్రామశివారులో గుట్టపై మల్లికార్జునస్వామి ఆలయం ఉంది. ఆలయ పరిసరాలు గుట్టలు, మానేరు డ్యాంతో ఆహ్లాదభరితంగా ఉంటాయి. ఈ ఆలయానికి ఆది, బుధవారాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చి బోనాలు సమర్పించి పట్నాలు వేసుకుంటారు. ఆలయం చుట్టూ నల్ల పోచమ్మ గుడి, ఎల్లమ్మ గుడి, నవగ్రహాల ఆలయం, సమ్మక్క సారలమ్మలు కొలువై ఉన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో స్వామివారి కల్యాణం, పెద్దపట్నాలు, జాతర వైభవంగా నిర్వహిస్తారు. గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడానికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

● పారువెల్ల లక్ష్మీగణపతి ఆలయం

మండలంలోని పారువెల్ల గ్రామంలో స్వయంభువుగా వెలసిన లక్ష్మీగణపతి ఆలయం ఉంది. ఆలయంలో స్వామివారికి తన మనసులోని కోరికను తలుచుకొని ముడుపుకడితే నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం. ఇక్కడ పలువురు రాజకీయ నాయకులు ముడుపులను కట్టి గెలిచాక మొక్కులు చెల్లించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆలయంలో ప్రతి సంకష్టహర చతుర్థి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

● 400 ఏళ్ల చరిత్ర గల లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మండల కేంద్రం గన్నేరువరంలో పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. ఈ ఆలయం కాకతీయుల కాలంలో సుమారు 400సంవత్సరాల క్రితం మొత్తం రాతితో నిర్మించారు.. ప్రతిఏటా చైత్ర పౌర్ణమి రోజున స్వామివారికి కల్యాణం, మరుసటి రోజు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతినిత్యం అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



పారువెల్ల లక్ష్మీగణపతి ఆలయం



మైలారంలోని మల్లికార్జునస్వామి ఆలయం



గన్నేరువరంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఎస్సారార్ కళాశాలలో బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్స్ పూర్తిచేసిన 14వబ్యాచ్ విద్యార్థినులకు గురువారం సర్టిఫికెట్ ప్రదానంచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లాకోర్టు న్యాయవాది పి కళ్యాణి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగడానికి ఈ బ్యూటీషియన్ సర్టిఫికెట్‌కోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈనాటి సమాజంలో బ్యూటీషియన్ రంగంలో అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఈ విద్యార్థినులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు.

కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఏ జ్యోతి లక్ష్మి, రిసోర్స్‌పర్సన్ ఆర్ లీనా, నితిన్,రాజయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, హరిజోత్ కౌర్, జువాలజీ హెచ్‌ఓడి కిరణ్మయి, ఏవో ఉమారాణి, అర్చన కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బ్యూటీషియన్ కోర్సు విద్యార్థినులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

టీపీసీసీ పరిశీలకుల నియామకం

● కరీంనగర్ జిల్లాకు నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ జిల్లా పరిశీలకులను ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ నియమించారు. కరీంనగర్ జిల్లాపరిశీలకులుగా టీపీసీసీ సీనియర్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డిలను నియమించారు. రానున్న కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత ఎన్నికలను గ్రామశాఖ కాంగ్రెస్, డివిజన్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్, బ్లాక్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ పార్టీల అధ్యక్షుల నియామకం కోసం స్థానిక క్యాడర్‌తో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించి, నివేదికను ఏఐసీసీ ఇన్‌చార్జికి అందజేయాల్సి ఉంటుంది.

● జగిత్యాల జిల్లా పరిశీలకులుగా వైద్యుల అంజన్‌కుమార్

జగిత్యాలజిల్లా పరిశీలకులుగా టీపీసీసీకార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్‌ను నియమిస్తూ ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. అలాగే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను నిజామాబాద్ జిల్లాకు, టీపీసీసీఅధికారప్రతినిధి మేన్నేని రోహిత్ రావును సిద్ధిపేట జిల్లా పరిశీలకులుగా నియమించారు.

బాధ్యతలు చేపట్టిన పర్సనల్ ఆఫీసర్

భగత్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకరీంనగర్ రీజియన్ పర్సనల్‌ఆఫీసర్‌గా జి సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగబాధ్యతలు స్వీకరించిన జి సత్యనారాయణను పర్సనల్ ఆఫీసర్ కార్యాలయ అసిస్టెంట్‌మేనేజర్ సత్తయ్య, సూపరింటెంట్ శ్రీనివాస్, సుజాత,వైఎల్‌నారాయణశుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

మల్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంను ఎత్తుకెళ్లారు. గుండేటి పవన్ అనే యువకుడు ద్విచక్ర వాహనాన్ని బుధవారంరాత్రి మార్కండేయ ఆలయం సమీపంలోని తమ ఇంటిముందు నిలిపి తాళంవేశాడు. గురువారం ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాయకుల వేధింపులు భరించలేకనే అజ్ఞాతంలోకి..

● సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో కార్యదర్శి మంత్రి ప్రియాంక



సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న కార్యదర్శి మంత్రి ప్రియాంక

తంగళ్లపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బానిస లాగా పనిచేయాలి.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, నిబంధనల విరుద్ధంగా తమకు నచ్చిన విధంగా పనిచేయాలంటూ నాయకుల వేధింపులు భరించలేక అజ్ఞాతంలోకి వెళ్లానని తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మంత్రి ప్రియాంక వెల్లడించారు. రెండు రోజుల క్రితం కార్యదర్శి అదృశ్యం కాగా పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. ప్రియాంకను తీసుకొని గురువారం సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కార్యదర్శి ప్రియాంక విలేకరులతో మాట్లాడుతూ నలుగురు వ్యక్తులు శ్రీకాంత్, అభినయ్, మల్లేష్‌బాబు, రాజు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, వారి వేధింపులు భరించలేక చెప్పాపెట్టకుండా వాట్సాప్‌లో రాజీనామా లెటర్ పంపి వెళ్లిపో యినట్లు తెలిపారు. నిజాయితీగా పనిచేయలేని పరిస్థితి కల్పిస్తుండడంతో ఉద్యోగం మానేసి దూరంగా వెళ్లిపోవాలని నిర్ణయించుకొని తిరుపతికి వెళ్లినట్లు తెలిపింది. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కమిటీలో సభ్యులుగాఉన్న మల్లేష్‌బాబు, అభినయ్, శ్రీకాంత్‌గౌడ్‌లు అనర్హులను ఎంపిక చేయాలని తీవ్రఒత్తిడికి గురిచేశారన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇంకుడు గుంతల బిల్లులు ఇవ్వాలని మల్లేష్‌బాబు తీవ్ర ఒత్తిడికి గురిచేశాడని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. వేధింపులు భరించలేకనే రాజీనామా పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించి తిరుపతికి వెళ్లిపోయానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే ఏదైనా ఉద్యోగం చూసుకొని కుటుంబ సభ్యులకు నిదానంగా చెబుదామని నిర్ణయించుకుని వెళ్లినట్లు తెలిపారు.

కలకలం రేపుతున్న మరణాలు..

- ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య
- మరొకరి అనుమానాస్పద మృతి

గంభీరావుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంలో గ్రామంలో ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇద్దరు ఒకేఇంట్లో మృతిచెందడం అనుమానాలకు తావిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గజసింగవరంలో గ్రామానికి చెందిన ఉల్లి శ్రీకాంత్(35) తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంత్ ఇంటికి సమీపంలో ఉండే చెరుకూరి రేఖ(30) కూడా అదే ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీకాంత్ తల్లిదండ్రులు ఇంటికి చేరుకునేసరికి కొడుకు ఉరివేసుకుని ఉండడంతో కేకలువేశారు. దీంతో ఇరుగు పొరుగు వారు చేరుకుని చూసే సరికి శ్రీకాంత్ ఉరివేసుకుని మృతిచెంది ఉండగా, అదే ఇంట్లో రేఖ అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. మధ్యాహ్నం నుంచి రేఖ కనిపించడం లేదని, ఆమెకోసం గాలిస్తున్న బంధువులకు సమాచారం అందించారు. రేఖ భర్త బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నాడు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, స్థానికఎస్‌ఐ ప్రేమానందం సంఘటన వద్దకు చేరుకుని, మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి వుషూ ఛాంపియన్ షిప్ పోటీలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అమేచ్యూర్ వుషూ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయిలో 3వ తెలంగాణ సబ్ జూనియర్స్ అండ్ జూనియర్స్, 2వ తెలంగాణ సీనియర్స్ వుషూ పోటీలను నిర్వహిస్తున్నట్లు గురువారం అమేచ్యూర్ వుషూ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ రవితేజ, ప్రధాన కార్యదర్శి బీ అఖిల, కోశాధికారి వీ భవాని తెలిపారు. ఏప్రిల్ తేది 26నుంచి 28 వరకు సిరిసిల్ల పట్టణం పద్మనాయక కళ్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి(ఇంటర్ డిస్ట్రిక్ట్)సబ్ జూనియర్స్, జూనియర్స్ సీనియర్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఎస్‌యూలో మూడో రోజుకు చేరిన సమ్మె



ఎస్‌యూలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్స్

గణేశ్‌నగర్,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె గురువారం మూడోరోజుకు చేరుకుంది. సైన్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగవిద్యార్థులు తమ మద్దతుప్రకటించి వారితోపాటుకూర్చుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సమ్మె శిబిరాన్ని సందర్శించిన నలంద డిగ్రీ కాలేజ్, జగిత్యాల ప్రిన్సిపాల్ శ్రీపాదనరేష్, రామకృష్ణడిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రిన్సిపల్ రాజేందర్, రామకృష్ణ డిగ్రీకళాశాల, కోరుట్లప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ఒప్పంద సహాయఆచార్యుల డిమాండ్స్ న్యాయమైనవని పూర్తి మద్దతు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పీఏపై కేసు నమోదు

హుజూరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వ పీఏ శివరాంపై బుధవారం అర్ధరాత్రి డ్రంకెన్ డ్రైవ్‌లో కేసునమోదైనట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రూరల్‌సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పీఏ శివరాం కారును నడుపుకుంటూ వస్తుండగా, పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు కారును వెంబడించి కేసీ క్యాంపు లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా, మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో శివరాంపై డ్రంకెన్‌డ్రైవ్ కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు



జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డికి స్వామి, ల్యాండ్ అక్వేషన్ జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వర్ దంపతులకు శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్

ధర్మపురి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ల్యాండ్ అక్వేషన్ జాయింట్‌డైరెక్టర్ ఉమామహేశ్వర్ దంపతులు వేర్వేరుగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి వేర్వేరుగా వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచారి, నంబి నరసింహమూర్తి, అర్చకులు వారందరిని వేర్వేరుగా ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారందరికి వేర్వేరుగా స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బొల్లారపు పోచయ్య, కొమురవెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేష్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బద్దం లింగారెడ్డి, కన్నం అంజయ్య, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంబాబుసిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో రైతు మృతి



గంగారాం(ఫైల్)

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి గంగారాం (65) అనే రైతు గురువారం వడదెబ్బతో మృతిచెందాడు. గంగారాం గోపాల్‌రావుపేట గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం పొలంలో వరిని కోత కోయిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి గంగారాం మృతిచెందాడు. మృతుడికి భార్య రాజవ్వ , కుమారులు రాజశేఖర్, రాజు, కూతురు కవిత ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో బుధవారం మునిగిన పట్టణంలోని మంచినీళ్లబావి ప్రాంగణానికి చెందిన నీలి మల్లికార్జున్ మృతదేహం లభ్యం అయినట్లు టౌన్ ఎస్సై మన్మధరావు తెలిపారు. బుధవారం చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతు కాగా పోలీసులు గజ ఈతగాళ్లతో వెతికించగా గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సారార్ కళాశాలలో జాబ్ మేళాకు స్పందన

గణేశ్‌నగర్,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో గురువారం స్వాన్ బిజినెస్ సర్వీస్ కంపెనీ, కళాశాల టిఎస్‌కెసి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేషస్పందన వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ తెలిపారు. జాబ్ మేళాలో 64 మంది విద్యార్థులు పాల్గొనగా 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ టి.రాజయ్య, విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి జాబ్ మేళాలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని తెలిపా రు.ఈ కార్యక్రమంలో స్వాన్ బిజినెస్ సర్వీస్ కంపెనీ ఎండి మణిదీపక్,టిఎస్‌కెసి కోఆర్డినేటర్ పి రాజేష్, కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ హర్ జ్యోత్ కౌర్ తదితారులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో సర్టిఫికేట్‌లతో ఎంపికైన విద్యార్థులు

ఈత చెట్లు దగ్ధం

కథలాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండలో గురువారం ప్రమాదావశాత్తు మంటలు అంటుకుని 2 వేల ఈత చెట్లు దగ్ధమయ్యాయి. మంటలు విపరీతంగా వ్యాపించడం వల్ల అక్కడే ఉన్న గీత కార్మికులు హుటాహుటిన నీళ్ల పోసి మంటలను అదుపులోకి తెచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సారంగాపూర్ : ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై దత్తాద్రి తెలిపిన కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం బాలపెల్లి గ్రామానికి చెందిన బేతి మధు(30) అనే యువకుడు గుల్లపేట గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఇంటికి బాలపెల్లి వస్తు న్నాడు. గుల్లపేట గ్రామానికి చెందిన జగ దీష్, రాజిరెడ్డి ఇద్దరు పోరండ్లలో ఓ కార్యక్రమానికి వెళ్లి గుల్లపేట వెళ్తున్న క్రమంలో కోనాపూర్ ఎల్లమ్మ ఆలయ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదు రెదురుగా ఢీకొన్నాయి, ఈ ఘటనలో మధు అక్కడికక్కడే మృతి చెందాడు, జగదీష్, రాజిరెడ్డిలకు తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. జగదీష్ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెట్‌పల్లి బంద్

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి) : పహల్గం టెర్రరిస్ట్ అటాక్ వలన మరణించిన భారతీయులకు సంఘీభావం తెలియజేస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం మెట్‌పల్లి బంద్‌కు పిలుపునిచ్చారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొడిమ్యాల, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం కొడిమ్యాల క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో అండర్ 17క్రికెట్ టోర్నమెంట్, బాయ్స్ టెన్నీస్ బాల్ ఆటల పోటీలను కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మన్, చొక్కాల నాగా ర్జున, మొగిళి శేఖర్, డేవిడ్‌సన్, సల్మాన్, నాగరాజు, సుమంత్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో గురువారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) :హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ను మెట్‌పల్లి పట్టణ 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అబ్దుల్ జాకీర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సంద ర్భంగా వార్డులో పలు అభివృద్ది పనుల గురించి పీసీసీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయ న తెలిపారు.

ఉగ్రదాడిపై వెల్లువెత్తిన నిరసనలు



ధర్మపురిలో నివాళులర్పిస్తున్న విప్ అడ్లూరి



మెట్‌పల్లిలో ఐఎంఏ ఆధ్వర్యంలో..



కోరుట్లలో దుకాణాలు బంద్

ధర్మపురి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రదాడిపై జిల్లాలో గురువారం నిరసనలు వెల్లువెత్తాయి. ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంతాప కార్యక్రమంలో గురువారం విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాద ముష్కరులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యప్రకమంలో టీపీసీసీ సభ్యులు, దర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

●**జగిత్యాల అర్బన్:** జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రదాడి దురదృష్టకర సంఘటన అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. గురువారం జగిత్యాల పట్టణంలోని మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఉగ్ర దాడి మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో ఎమ్మెల్యే నివాళులు అర్పించారు.

●**కోరుట్ల:** విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ ఇచ్చిన బంద్ పిలుపుకు గురువారం పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు బంద్ పాటించారు. పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు అమరులకు నివాళి అర్పించి ప్రగాఢ సంతాపంను ప్రకటించారు.

●పట్టణంలోని బార్ అసోసియేషన్ అద్వర్యంలో నిరసన ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో కొంపల్లి సురేష్, ముబీన్ పాషా, ఆడెపు వినోద్, శ్రీనివాస్, రమేష్, వందన, నవీన్‌లు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** మెట్‌పల్లి బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు బోడ్ల రమేష్ ఆధ్వర్యంలో తీవ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అసువులు బాసిన 26 మందికి మౌనం పాటిస్తు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, దొనికెల నవీన్, సత్యనారాయణ గౌడ్, వెంకట్‌రెడ్డి, కృష్ణమాచారి, మరంపల్లి శ్రీని వాస్, గంప శ్రీనివాస్, ఏలేటి ముత్యం రెడ్డి, పుల్ల సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

●పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పాత బస్టాండ్ వరకు పహల్గంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులతో నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గంగ సాగర్, వైద్యులు అమరేశ్వర్, రాజేశ్వర్, ఆనంద్ మాధురి తదితరులు పాల్గొన్నారు

●పహల్గం ఉగ్రదాడిని ఖండిస్తూ మెట్‌పల్లి పట్టణంలో ముస్లిం నాయకులు క్యాండిల్ మార్చ్ నిర్వహించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం సభ్యులు మౌనం పాటించారు. కార్యక్ర మంలో సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

●కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు నిరసనగా గురువారం మెట్‌పల్లి న్యాయవాదులు విధులను బహిష్కరించారు. న్యాయస్థానం ప్రధాన ద్వారం వద్ద నిరసన చేపట్టి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కంతి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, జాయింట్ కార్యదర్శి గజేల్లి రాందాస్, క్యాషియర్ పడిగేల శ్రీనివాస్, ఎజిపి అబ్దుల్ హఫీజ్, సీనియర్ న్యాయవాదులు రాజ్ మహ్మద్, జిల్లా వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి శ్రీనివాసన్, బోడ లక్ష్మణ్, బద్దం లక్ష్మారెడ్డి, గడ్డం శంకర్ రెడ్డి, పుప్పాల భానుమూర్తి,మన్నె గంగాధర్, అశోక్ పాల్గొన్నారు

●**కొడిమ్యాల:** మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో గురువారం రాత్రి అమరవీరులకు శాంతి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.

●**రాయికల్:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందినవారి ఆత్మ శాంతి చేకూరాలని కోరుతూ రాయికల్ పట్టణంలో మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు చెలిమెల మల్లేశం, ప్రధాన కార్యదర్శి రొట్టె శ్రీధర్, క్యాషియర్ మహ్మద్ సమీర్, గౌరవ అధ్యక్షుడు కట్కం శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు పిప్పోజి మహేందర్ బాబు, కార్యవర్గ సభ్యులు బైరి సుఖేష్, ఎంఏ అస్లాం పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** జమ్ముకాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని హిందు యువజన విభాగం అధ్యక్షులు పూడేరి శోభన్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నిశాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎవుసం గంగాధర్, అరికెల్ల అజయ్, ఉరుమల్ల రాజు, సురేష్, రాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండలంలోని మొగిలిపేట, వివిరావుపేట గ్రామాల్లో పహల్గాంన్‌లో జరిగిన దాడిని ఖండిస్తూ మృతి చెందిన వారి ఆత్మశాంతి చేకూరాలని నాయకులు నివాళులర్పించారు. గురువారం మల్లాపూర్ భారత మాత వద్ద బీజేపీ మండ లాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశ సమైక్యతను దెబ్బ తీసే కుట్ర చేస్తున్నారన్నారు.

'తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకం'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరవలేనిదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట సంజయ్ అన్నారు. గురు వారం మెట్‌పల్లి పట్టణంలోని ఆర్.బి సమావేశ మంది రంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జర్నలిస్ట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు ప్రజా సమస్యలపై ప్రతి నిత్యం పోరాడి ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా ఉంటు న్నారని అన్నారు. అనంతరం వరంగల్ లో జరగబోయే బీఆర్ఎస్ ఆవిర్భావ సభ ఆహ్వాన పత్రికలను జర్నలిస్ట్‌లకు అందజేశారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, మెట్‌పల్లి పట్టణ, ఇబ్రహీం పట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి మండలాలకు చెందిన రిపోర్టర్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఆహ్వాన పత్రికను మండలంలోని అయిలాపూర్ గ్రామంలో వివిధ కుల సంఘాలకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆహ్వాన ప్రతికను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సందయ్య, అనంత స్వామి లతో పలువురు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని షాదీఖానాలో హజ్ యాత్రికులకు వాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంబించారు. ఈ సందర్బంగా పహల్గాంలో హిందవులపై కాల్పులను ఖండిస్తూ మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని మౌనం పాటించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం హజ్ యాత్రికులకు అన్ని వసతులు కల్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అడువాల జ్యోతి, ముప్పాల రాంచందర్ రావు, జిల్లా వైద్యాదికారి ప్రమోద్, తహసీల్దార్ ఖయ్యూం, నాయకులు గోలి శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్, మన్సూర్, వీరబత్తిని శ్రీనివాస్, అహమ్మద్, ఫరూక్, హైదర్‌పల్లి ప్రభాత్, గిరి, శరత్‌రావు పాల్గొన్నారు.

న్యూ మిలీనియం పాఠశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న న్యూ మిలీనియం పాఠశాల విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని న్యూ మిలీనియం హైస్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్ర మంలో కరస్పాండెంట్ కస్తూరి రాంబాబుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్యా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి రత్న పద్మావతిని జిల్లా ఎస్పీ అశోక్ కమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా ఎస్పీ జడ్జికి పూల మొక్కను అందజేశారు.

సమస్య పరిష్కారం దిశగా ఆలోచించాలి

పోలీస్ సిబ్బంది సమస్య వస్తే పరిష్కారం దిశగా ఆలోచించాలి కాని మానసిక వేదనకు గురి కాకూడదని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం పోలీస్ సిబ్బందికి, అధికారులకు మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యక్తిగత, మానసిక, శాఖపరమైన సమస్య ఉంటే తనకు తెలియజేయాలని ఎస్పీ అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ మానసిక నిపుణుడు డాక్టర్ అశోక్ కమార్ పోలీస్ సిబ్బంది, అధికారులు ఎదుర్కొంటున్న వివిధ మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు.

నిర్మల్ టీపీసీసీ పరిశీలకుడిగా మెట్‌పల్లి నేత అవేజ్



మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా టీపీసీసీ పరిశీలకుడిగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన నాయకుడు ఎండీ అవేజ్‌కు చోటు లభించింది. నిర్మల్ జిల్లా టీపీసీసీ పరిశీలకులుగా మెట్‌పల్లి వాసి ఎండీ అవేజ్‌తో పాటు ఎం చంద్రశేఖర్ గౌడ్‌లను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్బంగా ఎండీ అవేజ్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో అందరిని సమన్వయం చేసుకొని కాంగ్రెస్ బలోపేతం కొరకు కృషి చేస్తానన్నారు. కాగా ఎండీ అవేజ్‌కు నిర్మల్ జిల్లా టీపీసీసీ పరిశీలకునిగా బాధ్యతలు అప్పగించడం పట్ల జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలగకుండా చూడాలి

కథలాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా చూడాలని డీఆర్‌డీఓ రఘువరన్ సూచించారు. గురువారం మండలంలోని తక్కళ్ళపల్లి, దూలూరు, బొమ్మెన, తాండ్ర్యాల సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం నిర్ణీత తేమలో తూకం వేయాలని అన్నారు. తప్పతాలు లేకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు పంపించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు రైతుల వివరాలను డాటా ఎంట్రీ చేయడంతో పాటు పుస్తక నిర్వాహణ సక్రమంగా ఉండాలన్నారు. రైతులకు కేంద్రాల వద్ద తాగు నీటి వసతితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. గన్నీ సంచులు, హమాలీ వంటి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా ఏపీఎం నరహరి, సీసీ రాజేందర్, విజయనిర్మల, వీఓఏలు ఉన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన

కొడిమ్యాల, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీ యూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు గురువారం కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ అధ్యాపకులు మారుతి, రాజశేఖర్, శ్రావణ్‌కుమార్, భాస్కర్, రంజిత్, మనోజ్, విజయ్, రవికుమార్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పూడురులో బ్రహ్మంగారి నాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కొడిమ్యాల, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామంలో గురువారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి నాటకం ప్రదర్శించారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నాటక కళామండలి పూడూర్ వారి ఆద్వర్యంలో పూడూర్ గ్రామానికి చెందిన కళాకారులు నాటకంలోని పాత్రలకు జీవం పోసినట్లు నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. బ్రహ్మేంద్రస్వామి వారి జననం, బ్రహ్మంగారుగోవిందమాంబ కల్యాణం, సిద్దప్ప గురుభక్తి, కాలజ్ఞానం, జీవ సమాది ఆద్యాంతం ఆసక్తికరంగా నాటకం కొనసాగింది. ఆధ్యాత్మికత వెదజల్లె ఈ నాటకాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా వచ్చారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇప్పుడు అనుభవిస్తున్న ఉద్యోగాలు అంబేద్కర్ కృషి ఫలితామేనని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని 11వ వార్డు వెంకట్రావ్‌పేటలో కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రచారం ప్రారంభించి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, బ్లాక్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాయిని సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 24 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో విద్యార్థులు మరిన్ని విజయాలతో ఎంచుకున్న లక్ష్యం సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని సేవా భారతి అధ్యక్షుడు గాజంగి రాజమల్లయ్య సూచించారు. మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన గాజంగి వైశాలి, సాహితి ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సేవా భారతి ఆధ్వర్యంలో గురువారం శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా తమ లక్ష్యం ఎంచుకొని సాధించడానికి నిరంతరం శ్రమించాలని, వచ్చిన ఫలితాలతో తమ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు రావడంతో పాటు తమ జీవితం ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి సభ్యులు గాజంగి జయకృష్ణ, జోగ హరీష్, తులసి శ్రీనివాస్, వినీత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధూర్ గ్రామంలోని శాంతి నికేతన్ పాఠశాలకు చెందిన 7గురు విద్యార్థులు సీట్లు సాధించగా వారిని గురువారం మాజీ ఎంపీపీ జాజాల భీమేశ్వరి-జగన్‌రావులు అభినందించి సత్కారించారు. విద్యార్థులకు స్వీట్లు తినిపించి పట్టుదలతో చదివి మంచి లక్ష్యలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు ఎడపల్లి వెంకటస్వామి, కరస్పాండెంట్ బూరం నారయణ, బండి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి):ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి కోరారు. మెట్‌పల్లి పట్టణంలో గురువారం పలు వీదులలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు రాందాస్ మరిపల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యంతో మామిడి రైతుకు నష్టం'



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మామిడి మార్కెట్‌లో మార్కెటింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి విమర్శించారు. గురవారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో చల్‌గల్‌లోని 25 ఎకరాలను మామిడి మార్కెట్ కోసం కేటాయిం చామన్నారు. అయితే మామిడి రైతుతో పాటు ఈ ప్రాంత కూలీలకు ట్రేడర్లకు ఉపాది కల్పించే విదంగా మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. మామిడిలో నాణ్యత లోపిస్తుందని 5 శాతం సూట్ తీయడంతో పాటు మళ్ళీ నాణ్యత నెలంతో గ్రేడింగ్ చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. మామిడి వేలం మార్కెటింగ్ శాఖ పద్ధతి ప్రకారం వేయకపోవడంతో వేలం నామమాత్రం అవుతున్నదని, అధికారికంగా 4 శాతం కమీషన్ పేరు చెప్పి 10 శాతం కట్ చేస్తున్నారని అన్నారు.

మామిడి మార్కెట్‌లో అవకతవకలకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. మామిడి మార్కెట్‌లో పని చేసే కూలీలకు మౌలిక వసతులు కల్పించే బాధ్యత మార్కెటింగ్ శాఖ చేపట్టాలని సూచించారు. వేలంలో ట్రేడర్లు అందరూ పాల్గొని వేలం ద్వారా మాత్రమే మామిడి కొనుగోలు చేయాలని అలాగే నాగ్‌పూర్ మార్కెట్ ధర బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. మామిడి మార్కెట్‌పై తహసీల్దార్ ను పర్యవేక్షణాధికారిగా నియమించడంతో పాటు వరి కొనుగోలు కేంద్రాలపై ఎలాగైతే కలెక్టర్, ఆర్డీఓ ప్రతి నిత్యం పర్యవేక్షిస్తున్నారో మామిడి మార్కెట్ విషయంలోను అదే పద్ధతి కొనసాగించాలని కోరారు. మామిడి మొత్తాన్ని వేలం ద్వారా కొనుగోలు చేయకుండా బయట వ్యాపారులు మాట్లాడుకొని అమాయకులైన రైతులను మోసగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, మాజీ ఎంపిపి జున్ను రాజేందర్, గాజుల రాజేందర్, గుంటి జగదీశ్వర్‌బొల్లి శేఖర్, కండ్లపెల్లి దుర్గయ్య, రఘువీర్

భూభారతి చట్టంతో ప్రతి ఒక్కరికీ న్యాయం



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్యాల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో రైతులు, భూయజమానులకు తీవ్ర నష్టం జరిగిందని అలాంటి ఇబ్బందులు పడకూడదనే కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో క్షణ్ణంగా అధ్యాయనం చేసి భూభారతి చట్టం తీసుకు వచ్చిందని దీంతో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని, భూసమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మల్యాల మండలం ముత్యంపేటరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిం చిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూభారతి చట్టంలో భాగంగా అధికారులు గ్రామాలకు వెళ్లి భూసమస్యల పరిష్కారం చేస్తారని తెలిపారు.

'సాదా బైనామాలకు పరిష్కారం'

భూసమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం లభించనున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. అలాగే ఈ చట్టం ద్వారా పక్కగా భూసరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూహక్కుదారులకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుదని అన్నారు. మనిషికి ఆదార్ కార్డు మాదిరిగా ముందు రోజుల్లో భూమికి భూదార్ కార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతి గ్రామానికో గ్రామ పరిపాలన అధికారి నియామకంకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌గౌడ్, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఎంఎంసీ చైర్మన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'పల్లెల అభివృద్ధి పంచాయతీరాజ్‌తోనే'

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 24 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి పంచా యతీరాజ్ సంస్థతోనే సాధ్యమవుతుందని గ్రామాపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. గురువారం జాతీయ పంచా యతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సిబ్బందితో నిబద్ధత పాలన అందిం చడంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావు ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగ భద్రత కల్పిం చేందుకు 73వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టగా 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి రావడం జరిగిందన్నారు. దీంతో గ్రామీణాభివృద్దిని ప్రోత్సహించడంలో, సామాజిక సాధికారితలో సమర్ధవంత పాలన అందించడంలో పంచాయతీ రాజ్ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పుల్ల జగన్‌గౌడ్, నాయకులు డాకూరి వెంకటేష్, పిడుగు తిరపతిరెడ్డి, జవిడి రవి, గడ్డ భూమేష్, ఏఎన్ఎమ్ లావణ్య, విద్యుత్ సిబ్బంది నవీన్, రాజు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 24 (ఆంధ్రజ్యోతి): జై బాపు, జై భీమ్, జసం విధాన్ నినాదంతో అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేం దర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలం లోని బండలింగాపూర్, రాజేశ్వర్‌రావుపే ట గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ను స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కేవలం నినాదం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలన్నారు. విభజించు పాలించు అనే నినాదంతో బీజేపీ ముందుకు వెళు తుందని, దీనిని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గండిహ నుమాన్ ఆలయం చైర్మన్ ఏనుగు రామా నుజన్‌రెడ్డి, జంగిటి రాజేందర్, గూడురు తిరుపతి, అమ్ముల రాహుల్, విజయ్, రాజు, మనోజ్, మల్లయ్య, విశ్వతేజ్, సత్త య్య, తుకారం, గంగస్వామి, భూమయ్య, చిన్నారెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.